

- చదువుతో పాటు మేధో వికాసం.. క్యూబ్ కింగ్‌లుగా నిలిచిన విద్యార్థులు...
- హిమజ శిక్షణలో మెరిసిన విద్యార్థులు.. విజేతలకు ట్రోఫీలు...

# మేధస్సుకు పదును పెట్టే రూబిక్స్ క్యూబ్ పోటీలు...

**శేరిలింగంపల్లి జూన్ 15(అక్షరగళం):** నేటి డిజిటల్ యుగంలో పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్‌లకే పరిమితమవుతున్న తరుణంలో, వారి మేధో వికాసానికి దోహదపడే కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరం. అలాంటి లక్ష్యంతో చందానగర్‌లో

మిగతా.. 2లో



తెలుగు దిన పత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

నిజం..నిర్భయంగా

## గ్రేటర్ -హైదరాబాద్

మంగళవారం, జూన్ 16, 2026










# ప్రజావాణిలో వరుస ఫిర్యాదులు...

- సీజ్ చేసిన భవనాల్లోనూ కొనసాగుతున్న పనులు...
- నోటీసులిచ్చినా సీజ్ చేసిన బిల్డర్లకే అధికారుల అండా...
- ఫోటోలకి ఫోజులు... చర్యలు మాత్రం శూన్యం !

**శేర్లింగంపల్లి అక్షరగళం జూన్ 15:**
శేరిలింగంపల్లి: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఫలితాలను ఇస్తోందనే ప్రశ్నలు మియాపూర్ మక్త మహబూబ్‌పేట్ ప్రాంతంలో వినిపిస్తున్నాయి. 44వ సర్వే నంబర్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే 31 ఫిర్యాదులు ప్రజావాణిలో సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల కథనం ప్రకారం, సంబంధిత నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు అందజేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతోందనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన, ప్రజావాణి పేరుతో



మిగతా.. 2లో

# ప్రజాసేవకుడికి జన్మదిన జేజేలు...

- సేవే ఆయుధంగా సాగిన 25 ఏళ్ల ప్రయాణం...
- 51వ వసంతంలోకి సాయిబాబు...

**కూకట్పల్లి అక్షరగళం జూన్ 15:**
రాజకీయాల్లో పదవులు సంపాదించడం ఒక విజయమైతే, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మరింత గొప్ప విజయం. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక సేవకుడు మందలపు సాయిబాబు చౌదరి అలాంటి అరుదైన నాయకుల్లో ఒకరు. ఆయన 51వ



జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు, అనుచరులు ఘనంగా నిర్వహించిన వేడుకలు ఆయనకు ప్రజల్లో ఉన్న ఆదరణకు అద్దం పట్టాయి.

గత పాతికేళ్లుగా ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ సాయిబాబు చౌదరి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా నిలవడం ఆయన ప్రత్యేకత. కష్టకాలంలో ఆదుకునే నాయకుడిగా స్థానిక ప్రజల మన్ననలు పొందారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో అనేక కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించి

మిగతా.. 2లో

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



3

# మాదాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లలో వర్షాకాల సన్నద్ధత చర్యలు



3లో..

# ప్రజావాణిలో వరుస ఫిర్యాదులు..

మొదటిపేజీ తరువాయి..

ఫిర్యాదులు స్వీకరిస్తున్నప్పటికీ వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శిస్తున్నారు.

ఇప్పటికే కొన్ని నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడమే కాకుండా, మరికొన్ని భవనాలను సీజ్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. అయితే సీజ్ చేసిన భవనాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు తొలగిపోయిన తర్వాత కూడా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా నిర్మాణాలు పూర్తయ్యాక గృహప్రవేశాలు కూడా నిర్వహిస్తున్నారని చెబుతున్నారు.

ప్రజల ఫిర్యాదులు ఒకవైపు, నిర్మాణ కార్యకలాపాలు మరోవైపు యథేచ్ఛగా కొనసాగుతుండటంతో అధికారుల పనితీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన వ్యవస్థే మౌనంగా ఉండటం వెనుక కారణాలేమిటనే చర్చ సాగుతోంది.

ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనర్, జోనల్ కమిషనర్, మియాపూర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్వయంగా జోక్యం చేసుకొని ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల అంశంపై విజిలెన్స్, యాంటీ కరప్షన్ బ్యూరో వంటి దర్యాప్తు సంస్థలు కూడా దృష్టి సారించాలని కోరుతున్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే ఫిర్యాదులపై పారదర్శకంగా చర్యలు తీసుకోవడం అత్యవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజావాణి ప్రజల గోడును వినే వేదికగా నిలుస్తుందా? లేక ఫిర్యాదులు దాఖలయ్యే మరో కార్యాలయ ప్రక్రియగానే మిగిలిపోతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం అధికారుల చర్యల ద్వారానే లభించనుంది.




# పారిశుధ్య కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూస్తా : ఎస్ ఎస్ పోతారెడ్డి

**అక్షరగళం, కుత్బుల్లాపూర్:** సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీలో ఎస్ఎఫ్ఏ మొగలయ్య నిర్లక్ష్యంతో సోమవారం జిహెచ్ఎంసి ఉన్నత సిబ్బంది రంగంలోకి దిగారు. ఆదివారం ఎస్ఆర్ నాయక్ నగర్, అపురూప కాలనీ, రామ్ రెడ్డి నగర్ లో సూపర్వైజర్ నిర్లక్ష్యం వల్ల పారిశుధ్య కార్మికులు ఐదు నిమిషాలు లేటు వచ్చారని అటెండెన్స్ వేయకుండా ఆయా కాలనీలో పారిశుధ్య నిర్వహణ లేకుండా వారిని ఇంటికి పంపిన ఘటన మనకు తెలిసిన విషయమే. సూపర్ వైజర్ పై వచ్చిన ఆరోపణలు తో వివిధ దినపత్రికలో వచ్చిన వార్తల ఆధారంగా జిహెచ్ఎంసి అధికారులు రంగంలోకి దిగారు. ఇటువంటి ఘటన మరొకసారి జరగకుండా చూస్తానని ఎస్ఎస్ పోతా రెడ్డి అపురూప కాలనీకి విచ్చేసి హామీ ఇచ్చారు. సూపర్వైజర్ మొగలయ్యపై చర్యలు తీసుకుంటామని పారిశుధ్య కార్మికులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా గ్యాప్ లేకుండా చూస్తామని పోతా రెడ్డి , సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణకి, ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరి వెంకట శేషాచారి కి హామీ ఇచ్చారు. అనంతరం గుబ్బల లక్ష్మీనారాయణ, ఆలూరు వెంకట శేష చారి మాట్లాడుతూ గతంలో కూడా ఇటువంటి పరిణామాలు చాలా జరిగాయని ఇకపై జరగకుండా సూపర్వైజర్ ను తక్షణమే రిమూవ్ చేయాలని డివిజన్లో కాలనీలన్నీ కూడా పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని పోతా రెడ్డి ని కోరారు



# పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను వెంటనే జమ చేయాలి

**ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసు రత్నం**



**అక్షరగళం, కుత్బుల్లాపూర్:** పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను వెంటనే జమ చేయాలని ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసు రత్నం అన్నారు. సోమవారం పలు సమస్యల పై సిఎంసీ, నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ షాబీర్ అలీ కీ వినతిపత్రం ఆయనతో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ లు పాల్గొని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసు రత్నం, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్లో పని చేసే కార్మికులకు గత ఏడు నెలలుగా పెండింగ్ లో ఉన్న పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి సంవత్సరం కార్మికులకు ఇచ్చే వర్ష కాలం కిట్ వెంటనే ఇవ్వాలన్నారు. . ప్రతి సంవత్సరం కార్మికులకు ఇచ్చే రెన్ కోర్టు, సబ్బులు, నూనె, గ్లౌజులు, యూనిఫామ్ డ్రస్, చెప్పులతో కూడిన కిట్ వెంటనే ఇవ్వాలని, గత ఏడు నెలలుగా పిఎఫ్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని, గత నెల కార్మికులకు జీతంలో కొంత కోత విధించిరాని వాటిని వెంటనే సరిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నకంటి దస్తగిరి, బక్క మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




# మేధస్సుకు పదును పెట్టే రూబిక్స్ క్యూబ్ పోటీలు...

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించిన రూబిక్స్ క్యూబ్ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికగా నిలిచాయి.

చందానగర్‌లోని డివైన్ హోమ్స్ క్లబ్‌లో పోతన ధనలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని తమ అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిరియాల ప్రీతమ్ విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు.రూబిక్స్ క్యూబ్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదు.

అది మెదడుకు వ్యాయామం. ఏకాగ్రత, సమయపాలన, సమస్య పరిష్కార నైపుణ్యం, సహనం, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలను పెంపొందించే సాధనమని నిపుణులు చెబుతున్నారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలోనే క్యూబ్‌ను పరిష్కరించడం అక్కడికి వచ్చిన వారిని ఆశ్చర్యానికి గురిచేసింది.ఈ విజయాల వెనుక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు పొందిన హిమజ టీచర్ కృషి ప్రత్యేకంగా నిలిచింది.

చిన్నారులకు క్యూబ్ నేర్పించడంలో ఆమె చూపుతున్న అంకితభావం, శిక్షణా విధానం వల్లే విద్యార్థులు ఈ స్థాయిలో రాణిస్తున్నారని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. పిల్లల ప్రతిభను చూసిన ప్రతి ఒక్కరూ హిమజ సేవలను ప్రశంసించారు.కార్యక్రమంలో మాట్లాడిన మిరియాల ప్రీతమ్, విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి మేధోపరమైన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించే ప్రతిభావంతులు ఇలాంటి వేదికల నుంచే తయారవుతారని అన్నారు.

పోటీల అనంతరం విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఎస్. శ్రీనివాస్ రావుకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలలో దాగి ఉన్న మేధస్సును వెలికితీసి, వారిని సృజనాత్మక ఆలోచనల వైపు మళ్లించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. చందానగర్‌లో నిర్వహించిన ఈ రూబిక్స్ క్యూబ్ పోటీలు ఆ దిశగా ఒక స్ఫూర్తిదాయక అడుగుగా నిలిచాయి.

# ప్రజాసేవకుడికి జన్మదిన జేజేలు...

మొదటిపేజీ తరువాయి..

అండగా నిలిచారు. వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించిన వేళ సహాయక చర్యల్లో ముందుండి పనిచేశారు. పేదలకు వైద్య సహాయం అందించడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేశారు. అందుకే ఆయనను స్థానికులు "ప్రజల మనిషి"గా అభివర్ణిస్తుంటారు.సామాజిక సేవను రాజకీయ బాధ్యతగా భావించే సాయిబాబు చౌదరి, ప్రజలతో నిత్యం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషిస్తుంటారు. యువతకు ప్రోత్సాహం, సామాజిక కార్యక్రమాలకు సహకారం, పేదల సంక్షేమం వంటి అంశాల్లో ఆయన చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పలువురు పేర్కొంటున్నారు. జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సైతం సాయిబాబు చౌదరి సేవలను కొనియాడారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుడిగా ఆయనను అభివర్ణిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నాయకుడిగా కాకుండా సేవాభావం కలిగిన వ్యక్తిగా ప్రజల మన్ననలు పొందుతున్న మందలపు సాయిబాబు చౌదరి ప్రస్థానం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ప్రజల మధ్యే ఉంటూ ప్రజల కోసమే పనిచేయాలనే ఆయన సంకల్పం మరింత బలపడాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని అభిమానులు కోరుకుంటున్నారు.ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి ముందుకు సాగే నాయకత్వమే సమాజానికి అవసరం. అలాంటి నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న మందలపు సాయిబాబు చౌదరి సేవా ప్రస్థానం మరింత విస్తరించాలని ఆశిద్దాం.



# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**అక్షరగళం, మేడ్చల్ ప్రతినిధి:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టరు (95) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు.

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.

స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్‌లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి

### సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

**అక్షర గళం, హైదరాబాద్:** ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం, పారదర్శకత , జవాబుదారీతనం ఉండాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూచించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సైబరాబాద్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులు , సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎంసీ కమిషనర్ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.

అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యత ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 97 ఫిర్యాదులు , వినతులు స్వీకరించబడగా, వాటిని తదుపరి పరిశీలన , పరిష్కార చర్యల కోసం సంబంధిత శాఖలకు పంపించారు. టౌన్ ప్లానింగ్ – 77, ఇంజినీరింగ్ – 8, ఫైనాన్స్ & అకౌంట్స్ – 1, చెరువులు (లేక్స్) – 2, రెవెన్యూ – 2, శానిటేషన్ – 3, ట్రాన్స్‌పోర్ట్ – 1, అర్బన్ బయోడైవర్సిటీ – 2, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్–1ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత బృందాలతో సమన్వయం చేసుకుని, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, సకాలంలో పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.




ప్రజావాణి కార్యక్రమం ప్రజలు తమ సమస్యలను నేరుగా పరిపాలన దృష్టికి తీసుకువచ్చే ముఖ్యమైన వేదికగా కొనసాగుతోంది.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రజా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం కోసం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని కమిషనర్ తెలిపారు.

# మాదాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లలో వర్షాకాల సన్నద్ధత చర్యలు

### నీటి నిల్వ సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు

**అక్షరగళం, శేరిలింగంపల్లి:** అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి నిల్వకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధత కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) మాధాపూర్ సర్కిల్, శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కీలక నీటి నిల్వ (వాటర్ లాగింగ్) ప్రాంతాల్లో సోమవారం విస్తృత స్థాయిలో నివారణ చర్యలను చేపట్టారు. కమిషనర్ఆదేశాల మేరకు ఇంజినీరింగ్, శానిటేషన్ , క్షేత్ర స్థాయి బృందాలు సమన్వయంతో పనిచేస్తూ వర్షపు నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరిచే చర్యలు, అడ్డంకుల తొలగింపు, నాలాల సామర్థ్య పునరుద్ధరణ, స్టార్మ్ వాటర్ డ్రైన్ల శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టి నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు తీసుకున్నారు. మాధాపూర్ సర్కిల్ పరిధిలో నీటి నిల్వకు గురయ్యే ఐదు ప్రధాన ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టారు. దుర్గం చెరువు సమీపంలోని విఠల్ రావు నగర్ వద్ద బాక్స్ డ్రెయిన్ ప్రవేశద్వారం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు , తేలియాడే చెత్త పేరుకుపోవడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గ్రేటింగ్ తొలగించి డ్రెయిన్ ప్రవేశద్వారాన్ని విస్తరించడం ద్వారా నీటి ప్రవాహాన్ని మెరుగుపరిచారు. లెదర్ ఇన్‌స్టిట్యూట్ సమీపంలోని మల్కం చెరువు వద్ద, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ , క్రాస్ డ్రెయిన్‌లలో పేరుకుపోయిన మట్టిని తొలగించి ప్రత్యేక యంత్రాల సహాయంతో పూర్తిస్థాయిలో శుభ్రపరిచారు. దీంతో చెరువులోకి వర్షపు నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. గచ్చిబౌలిలోని ప్రెస్టన్ ప్రైమ్ మాల్ సమీపంలో డ్రెయిన్ గ్రేటింగ్‌లు మూసుకుపోవడం, ఖాజాగూడ చెరువుకు వెళ్లే అవుట్‌ఫాల్ మార్గం అడ్డంకులకు గురికావడంతో నీటి నిల్వ ఏర్పడింది. గ్రేటింగ్‌లను శుభ్రపరచడంతో పాటు నాలాను అసలు సామర్థ్యానికి పునరుద్ధరించి, డ్రెయిన్ లైన్‌ను క్లియర్ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించారు. సైబర్ టవర్స్ -- యశోద ఆసుపత్రి రహదారి వద్ద స్మైలైన్ డెంటల్ ఆసుపత్రి సమీపంలో, కల్వర్ట్ వెంటిలేషన్ ఓపెనింగ్‌లు తగినంతగా లేకపోవడం వల్ల నీటి ప్రవాహం మందగించింది. ఈ వెంట్ ఓపెనింగ్‌లను విస్తరించడం ద్వారా వర్షపు నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచారు. జూబ్లీ గార్డెన్, ఇజ్జత్ నగర్ ప్రాంతంలో నాలా వెడల్పు తగ్గిపోవడం, మట్టి పేరుకుపోవడం, అవుట్‌లెట్ పరిమితులు మరియు సహజ ప్రవాహ మార్గంలో అడ్డంకులు ఉండటం వల్ల నీటి నిల్వ సమస్య ఏర్పడుతున్నట్లు గుర్తించారు. దీనిపై విస్తృత స్థాయిలో డీసిల్టింగ్ చేపట్టి, అడ్డంకులను తొలగించి, అవుట్‌లెట్‌ను అసలు సామర్థ్యానికి పునరుద్ధరించారు. అలాగే భవిష్యత్తులో శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మూడు ప్రధాన నీటి నిల్వ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఖాజాగూడలోని స్టేట్ ఎలక్షన్ కమిషన్ భవనం సమీపంలో స్టార్మ్ వాటర్ ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న డైవర్షన్ పైప్‌లైన్‌ను తొలగించి నాలాను పునరుద్ధరించారు. దీంతో ఖాజాగూడ చెరువులోకి వర్షపు నీటి ప్రవాహం సాఫీగా జరుగుతోంది. కొండాపూర్‌లోని సంతోష్ ధాబా సమీపంలో , స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ఇన్‌లెట్‌లు మూసుకుపోవడం, దిగువ భాగంలో ఏర్పడిన బాటిల్‌నెక్ కారణంగా నీటి నిల్వ సమస్య తలెత్తింది. ఇంజినీరింగ్ , శానిటేషన్ బృందాలు సంయుక్తంగా డ్రెయిన్‌లను శుభ్రపరిచి నీటి ప్రవాహాన్ని మెరుగు పరిచాయి. అదనంగా హైడ్రాతో సమన్వయం చేసుకుంటూ శాశ్వత పరిష్కార చర్యలు కొనసాగుతున్నాయి.





మల్కం చెరువు సమీపంలో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పాయింట్లను తొలగించి చెరువులోకి నీరు సాఫీగా చేరేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ ప్రమాదం గణనీయంగా తగ్గింది. సిఎంసి బృందాలు హైడ్రా, ట్రాఫిక్ పోలీస్ , ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అన్ని సున్నిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. నాలాల డీసిల్టింగ్, అడ్డంకుల తొలగింపు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ల నిర్వహణ, ఇన్‌లెట్‌ల శుభ్రపరిచే కార్యక్రమాలు, క్షేత్ర స్థాయి తనిఖీలు నిరంతరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అవసరమైన యంత్రాలు, సిబ్బంది, ప్రత్యేక బృందాలను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడం, సమర్థవంతమైన వర్షపు నీటి పారుదల వ్యవస్థను నిర్వహించడం , నగర మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడం పట్ల సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని కమిషనర్ తెలిపారు.